క్లుప్తంగా

ఓసీపీలో ప్రత్యేక పూజలు



మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్(ఓసీపీ)ప్రాజెక్టులోని కాపురం ఏఎమ్మార్ క్యాంపు కార్యాలయంలో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ నేపథ్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఏఎమ్మార్ ప్రాజెక్టు కంపెనీ ఎండీ మహేశ్వర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం ఆలయ ఆవరణలో వేద పండితులతో సమక్షంలో పూజలు, హోమాలు చేపట్టారు. ఐదు రోజులపాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న దుర్గామాత ఆలయంలో దుర్గదేవి, శివాలయంలో గణపతి, కుమారస్వామి, షిరిడి ఆలయంలో సాయి బాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఏఎమ్మార్ అధికారులు తెలిపారు.

ఆర్‌ఐగా ప్రదీప్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌ఐ రామస్వామిని చిట్యాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ భవేష్‌మిశ్రా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ప్రదీప్‌కుమార్‌కు ఆర్‌ఐగా, సయ్యద్ అజారోద్దీన్‌కు అదనపుగా ఆర్‌ఐగా బాధ్యతలు అప్పగించారు.

దుస్తుల పంపిణీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రథసప్తమి పండుగ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు కామిడి లక్ష్మి శ్రీనివాసరెడ్డి దంపతులు శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

లక్ష ఖాతాలు తెరవడమే లక్ష్యం

కాటారం: కరీంనగర్ పోస్టల్ డివిజన్‌లో లక్ష ఖాతాలు తెరవడమే లక్ష్యంగా సెలవుదినాల్లో సైతం పోస్టాఫీసులు తెరిచి ఉంచుతున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నేడు (ఆదివారం) అన్ని తపాలాశాఖ కార్యాలయాలు తెరిచి ఉంచి ఖాతా ఓపెన్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. కొత్తవడ్డీ రేట్లను ప్రజలకు వర్తింపజేయాలనే సంకల్పంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఆదివారం పలు రకాల ఖాతాలను తెరవడం కోసమే పోస్టాఫీసులు పని చేస్తాయని ఇతర కార్యకలాపాలు కొనసాగవన్నారు. ఆర్థిక చేయూతనందించే తపాలాశాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటాం

వాజేడు : తాము రైతులకు అండగా ఉంటామని సీ ఆర్‌పీఎఫ్ పోలీసులు నిరూపించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఆర్‌పీఎఫ్ సీ/39 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని బొల్లారం, ఘణపురం, మొరుమూరు, అరుణాచలం గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ పని ముట్లు అయిన గొడ్డలి, పార, కొడవలి, వంటి వస్తువులను అందజేశారు. వాటితో పాటు 30 బస్తాల వర్మి కంపోస్టు ఎరువుల బస్తాలను ఇచ్చారు. ఎస్సైలు కొప్పుల తిరుపతి రావు, సురేష్, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సతీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు శేషయ్య, సైమన్ ఉన్నారు.

యోగాలో రాణిస్తున్న మధు

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ
- పోలీస్ కానిస్టేబుల్ విధులతో పాటు యోగాలో ప్రావీణ్యం



ఎస్పీ భాస్కరన్ చేతుల మీదుగా సౌత్ ఏషియన్ యోగా చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంటున్న మధు(ఫైల్)





యోగా చేస్తున్న మధు

Sunday Special

కాటారం: పోలీస్ శాఖలో తన వృత్తిని సమర్థవంతంగా నిర్వహిస్తూనే మరో పక్క యోగాలో తనదైన ప్రతిభను కనబరుస్తున్నారు ఓ పోలీస్ కానిస్టేబుల్. గత కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ అతడితో పాటు పోలీస్‌శాఖలో మరికొంత మందికి శిక్షణ అందిస్తున్నారు కాటారం డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మధు.

యోగాలో మేటి..

మల్హర్ మండలం కొయ్యూర్ గ్రామానికి చెందిన ఎర్ల మధు 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖలో సివిల్ విభాగం కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించాడు. ప్రస్తుతం కాటారం డీఎస్పీ కార్యాలయంలో క్రైం రైటర్‌గా పని చేస్తున్నాడు. వృత్తిరీత్యా నిబద్ధతతో వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసపత్రాలు, రివార్డులు అందుకోవడంతో పాటు 2022 సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన కఠిన సేవా పథకాన్ని అందుకున్నారు. కాగా మధు పోలీస్ విధుల్లోనే కాకుండా యోగాలో ఎంతో నైపుణ్యత కల్గిఉండి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. 2016లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రెండు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, 2017లో జార్ఖండ్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ యోగా జట్టులో రాష్ట్రం నుంచి పాల్గొన్నారు. 2018లో ముంబైలో జరిగిన సౌత్ ఏషియన్ యోగా చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ సాధించడంతో పాటు 2019లో రాజస్తాన్ రాష్ట్రం జైపూర్‌లో నిర్వహించిన నేషనల్ యోగా చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యోగా టీంకు ప్రాతినిధ్యం వహించారు. వాటితో పాటు గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 15 వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్‌గేమ్స్‌లో తెలంగాణ పోలీస్ యోగా టీం కోచ్‌గా వ్యవహరించారు. ఈ పోటీల్లో అతడి పర్యావేక్షణలో తెలంగాణ టీం గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్ సాధించింది. ఈ నెల రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో జరిగిన జాతీయ యోగా పోటీలకు రాష్ట్ర పోలీస్ యోగా టీంకు మధు కోచ్‌గా ఉండి జట్టును ముందుకు తీసుకెళ్లారు. జాతీయ స్థాయి పోలీస్ యోగా టీంకు జిల్లాకు చెందిన కానిస్టేబుల్ మధు కోచ్‌గా వ్యవహరించడం గర్వకారణమని పలువురు హర్షిస్తున్నారు. యోగాలో మధు రాణిస్తుండటంపై జిల్లా, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు అభినందిస్తున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత..



యోగాతో శారీరకంగా ప్రయోజనం కల్గడంతో పాటు మానసిక ప్రశాంతత ఉంటుంది. నాకు చిన్ననాటి నుంచి యోగా అంటే ఎంతో మక్కువ. ప్రతి రోజు యోగా చేయడం అలవాటుగా మారిపోయింది. ఉన్నతాధికారుల సహకారంతో తనతో పాటు నలుగురికి నేర్పించడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరు యోగాకు ప్రాధాన్యత ఇచ్చి కొంత సమయం కేటాయిస్తే పూర్తి ఆరోగ్యంగా ఉంటారు.

\- మధు, యోగాకోచ్, కానిస్టేబుల్

నర్సరీ నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

కాటారం: హరితహారం మొక్కల పెంపకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వన నర్సరీల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు నిర్వాహకులకు సూచించారు. కాటారం మండలం ఆదివారంపేటలో వన నర్సరీని శనివారం ఎంపీడీఓ పరిశీలించారు. నర్సరీలో విత్తనాలు నాటి పదిరోజులు పూర్తికాగా కేవలం 30శాతం గింజలు మాత్రమే మొలకలు రావడంతో తిరిగి విత్తనాలు నాటాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా నీరు అందించాలని అన్నారు. కూలీలు, పంచాయతీ కార్యదర్శికి మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే శుభ్రం చేయాలని ఆయాను ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఫీల్డ్‌అసిస్టెంట్ ఉన్నారు.

పార్టీలకు అతీతంగా అండగా నిలవాలి



నేరేడుపల్లిలో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: మీ కుటుంబంలో సభ్యుడిగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ప్రజలు తనకు అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు కోరారు. హాత్‌సేహాథ్ జోడోయాత్రలో భాగంగా శనివారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు, వజినపల్లి, నేరేడుపల్లి, కొత్తపల్లి, కొంపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అధోగతి చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. పలు పార్టీల నాయకులకు రూ.కోట్ల ఆస్తులున్నాయని, ప్రజలే తనకు రూ.కోట్ల ఆస్తితో సమానమన్నారు. రెండు సార్లు మీ ముందుకు వచ్చానని, తనను బీఆర్‌ఎస్ పార్టీ చేసిన మోసాన్ని గ్రహించిన ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తున్నానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సత్యనారాయణరావుకు మహిళలు మంగళ హారతులతో డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో పార్టీలో చేరిన కార్యకర్తలకు సత్యనారాయణరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, నాయకులు అంబాల శ్రీనివాస్, రాంనేని రవీందర్, బండి తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



స్వామివారిని ఊరేగిస్తున్న ప్రజలు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని సూర్యవాహన సేవలో మాడ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి, ఈఓ బిల్ల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ధర్మకర్తలు కుమారస్వామి, పోగు సుమన్, శంకర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్



కాటారం: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా బొడిగే శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని సోషల్ మీడియా ద్వారా బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన శ్రీధర్‌బాబుతో పాటు కాంగ్రెస్ యూత్ నాయకులు శ్రీనుబాబు, మండల నాయకులు, కార్యకర్తలకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ కమిటీ ఎన్నిక



కమిటీని ఎన్నుకుంటున్న నాయకులు

మహాముత్తారం: మండలంలోని మాదారంలో శనివారం ఆదివాసీ నాయకపోడ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బెల్లంకొండ లక్ష్మయ్య, అధ్యక్షుడిగా బోద సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా బచ్చల పోషయ్య, పెండరి సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా సారయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గొట్టం భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల రామచంద్రం తదితరులు ఉన్నారు.

పుట్ట మధు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



జాబితాను విడుదల చేస్తున్న నాయకులు

మహదేవపూర్: రానున్న శాసనసభ సాధారణ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యేగా పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధును గెలిపించడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీఆర్‌ఎస్‌పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, సర్పంచ్ శ్రీపతిబాపులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌ల వారిగా ప్రతి వంద మంది ఓటర్ల బాధ్యత ఒక కార్యకర్తకు అప్పగిస్తూ శనివారం జాబితాను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ అలీం ఖాన్, టౌన్ ప్రెసిడెంట్ రాకేశ్, మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, సీనియర్ మండల మహిళా నాయకులు కుంభం పద్మ, గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ వెన్నంపల్లి మహేశ్, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు సాజీద్ అలీ, యూత్ టౌన్ అధ్యక్షుడు రెవెల్లి రాజశేఖర్, సీనియర్ మండల నాయకులు బాపురావు, చాగర్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల(రేగొండ): గ్రామాల్లో చైన్ స్నాచింగ్ దొంగలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇటీవలే రేగొండ మండలంలోని పోచంపల్లిలో ఒక మహిళపై స్నాచింగ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారని తెలిపారు. మహిళలు శుభ కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలన్నారు. ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్ దొంగలు చోరీలకు పాల్పడుతారని అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీ

వెంకటాపురం(ఎం): మండలంలోని పాపయ్యపల్లిలో ఆంజనేయస్వామి, పోచమ్మతల్లి దేవా లయాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆలయంలో ఉన్న నగలను అపహరించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం భక్తులు ఆలయాల సందర్శనకు వెళ్లగా ఆలయ ముఖద్వారం తలుపులు పగలగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. గర్భగుడిలోకి వెళ్లి చూడగా ఆంజనేయ స్వామికి చెందిన వెండి కండ్లు, సీతమ్మ మెడలోని బంగారు మంగళసూత్రాలు, పోచమ్మ తల్లికి చెందిన వెండి కళ్లను అపహరించారు. రెండు ఆలయాల్లో దొంగతనం జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

చిట్యాల: తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని నైన్‌పాక గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నైన్‌పాక గ్రామానికి చెందిన మండ రమేశ్ రోజుమాదిరిగానే తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పిడిసిల్లలో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్లలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం మొగుళ్లపల్లి సీఎస్‌ఐ మిషనరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, బిషనరీ రెవ.జెస్.మాత్యు, డాక్టర్ బాబు కేటి (కేరళ), సిస్టర్ శైలజ, పాస్టర్ విజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

మొగుళ్లపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇస్సిపేట గ్రామానికి చెందిన పొన్నాల మల్లారెడ్డి అతడికి పండిన పత్తి, ఎరువుల బస్తాలు, పురుగుమందులు తన పాత పెంకుటింట్లో నిల్వ చేసుకున్నాడు. అదేవిధంగా ఇటీవల పాడిగేదెకు జన్మించిన చిన్నదుడ్డెను ఆ ఇంటిలో రోజులాగే కట్టేసి వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. కాగా మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లుకు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కాని ఫైర్ ఇంజన్ వచ్చేలోపే ఇంటిలో బాధితుడికి సంబంధించిన పత్తి, వ్యవసాయ ఎరువులు, ఇంటికి చెందిన కర్ర, దుడ్డె పక్కనే ఉన్న గడ్డికట్టలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సుమారు రూ.10 లక్షల ఆస్థి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు బోరునా విలిపించాడు. ప్రభుత్వం సాయం అందించాలని కోరాడు.

త్రీఫేజ్ కరెంటు కోతతో అవస్థలు



ఏఈ అశోక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏటూరునాగారం: త్రీఫేజ్ కరెంటును పొలాలకు ఇవ్వకపోవడంతో రైతులు పంటలకు సాగునీరు పారించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించి రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ అశోక్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 10 రోజులుగా మండలంలో రైతుల మోటార్లకు కరెంట్ సరఫరా ఏ సమయం నుంచి ఏ సమయం వరకు వస్తుందో తెలియయడం లేదన్నారు. అనవసరమైన లోడు ఉందని కోతలు విధించడం సరికాదన్నారు. మిర్చిపంటలకు, వరి పొలాలకు నీరు అందించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా ఏసీడీ బిల్లులు గృహ అవసరాలు, వ్యాపారస్తులకు బిల్లులో జతపర్చి చేయడంతో వేలాది రూపాయలు కట్టలేని పరిస్థితిలో ప్రజలున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ ఖలీల్‌ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ గుడ్ల శ్రీలతదేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉసురుపోసుకుంటున్న ప్రభుత్వం

కన్నాయిగూడెం : రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ పంటలకు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని ఎంపీపీ జనగం సమ్మక్క శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు ఇస్తున్న త్రీఫేజ్ కరెంట్ కొన్ని రోజుల నుంచి ఎప్పుడు ఇస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ సరిగా రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు.

సమస్యలపై పట్టింపేది ?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- గైర్హాజరైన అధికారులపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం : మండలంలోని పనిచేస్తున్న ఆయా శాఖల అధికారులు ప్రజల సమస్యలపై పట్టింపులేని విధంగా వ్యవహరిస్తున్నారని, జవాబదారితనాన్ని మర్చిపోతున్నారని మండల ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల గైర్హాజర్, సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌సీడీ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మండలానికి మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ సాత్వికను నియమించినట్లు తెలిపారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలో ఆమె వారానికి ఒక రోజు వచ్చి వెళ్తున్నారన్నారు. ఆహార భద్రత అధి కారి రోహిత్‌రెడ్డిని పిలిపించి ఆహార పదార్థాల వ్యాపారం చేసే హోటళ్లు, బేకరీలు ఇతర వస్తువులపై అవగాహన కల్పించి లైసెన్స్‌లు ఇచ్చేందుకు మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రొయ్యూర్ పీహెచ్‌సీ భవనం నాలుగేళ్లుగా అసంపూర్తిగానే ఉందని ఎంపీటీసీ జాడి లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ నీటి సరఫరా జరగడం లేదని, మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని రామన్నగూడెం ఎంపీటీసీ అల్లి సుమలత తెలిపారు. తాగునీటి సమ్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని మిషన్ భగీరథ ఏఈఈ మోహన్ కోరారు.

అధికారుల గైర్హాజర్‌పై సభ్యులు మండిపాటు

మండల సభకు మండలంలో పనిచేసే అధికారులు రాకుంటే ప్రజల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని వైస్ ఎంపీపీ సంజీవరెడ్డి, చెల్పాక ఎంపీటీసీ కోట నర్సింహులు, సర్పంచ్ ఈసం రామ్మూర్తి మండిపడ్డారు. ఈ విషయంపై సభ్యులంతా ఒక్కసారిగా లేవనెత్తారు. వైస్ ఎంపీపీ సభ నుంచే జెడ్పీ సీఈఓ ప్రసూనరాణికి ఫోన్ చేసి సభకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో గుడుంబా ఏరులై పారుతోందని, అబ్కారీశాఖ అధికారులు అసలేం పట్టించుకోవడం లేదన్నారు. కోడిపుంజుల అంగడిప్రదేశాన్ని వరదముంపు బాధితులకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరుతూ తీర్మానం చేయాలని సర్పంచ్ రా మ్మూర్తి సభ్యులను కోరారు. రామన్నగూడెం జీపీకి పనులు ఎందుకు పెట్టలేదని సర్పంచ్ దొడ్డ కృష్ణ పీఆర్ ఏఈ భిక్షపతిని ప్రశ్నించారు. ఉపాధి హామీ ద్వారా చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు వచ్చినట్లుగా ఏపీఓ అంకూస్ తెలిపారు. ఊరిలో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సభ్యులు కోరారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల సమన్వయంతో పనులు చేయించుకొని ప్రజల ఇబ్బందులు తొలగించుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పశువులకు రేబిస్ టీకాలు



టీకా వేస్తున్న వైద్యులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పిచ్చికుక్క 30 పశువులను కరవడంతో మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో వైద్యులు శనివారం ఆ పశువులకు రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొండయ్య, ఎంపీటీసీ మహిపాల్‌రెడ్డి, గోపాల మిత్ర, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.